మున్సిపల్ కమిషనర్‌గా బివి ప్రసాద్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో డిఇ బివి ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన మంగళవారం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న విహెచ్ సత్యనారాయణ పనితీరు బాగోలేని కారణంగా జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సరెండర్ చేశారు. దీంతో ఇంఛార్జి కమిషనర్ గా మున్సిపల్ డిఇ ప్రసాద్‌ను ఇంఛార్జి కమిషనర్ గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పట్టణ ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి - మక్కువ

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పనసభద్ర పంచాయతీలో రూ.1.20 కోట్ల ఉపాధి హామీ నిధులతో రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన మెండంగి - దుగ్గేరు రహదారిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఏజెన్సీలో రహదారి నిర్మాణం ద్వారా గిరిజనులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడానికి కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు. ఈ రహదారి నిర్మాణం వల్ల గ్రామస్తులకు మంచి మౌలిక సదుపాయాలు కలుగుతాయన్నారు. విద్య, వైద్యం, వ్యాపారం వంటి అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఇది గొప్ప సహాయంగా ఉంటుందని అన్నారు. రహదారి నిర్మాణం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాలకు రోడ్డుతో కొత్త వెలుగులు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు సురక్షితంగా స్కూళ్లకు వెళ్లగలుగుతున్నారని, అత్యవసర సమయంలో ఆసుపత్రికి చేరుకోవడం సులభమైందని, వ్యాపారం, వ్యవసాయం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వివరించారు. అనంతరం మంత్రి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పనసభద్ర సర్పంచ్ సీదరపు గంగమ్మ, తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, పనస భద్ర పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మెండంగి-దుగ్గేరు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

కొత్త బస్సును ప్రారంభించిన మంత్రి

సాలూరు : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద కొత్త బస్సును మంత్రి సంధ్యారాణి జెండా ఊపి ప్రారంభించారు. స్వయంగా బస్సును నడిపి డ్రైవర్లలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు సుఖంగా ప్రయాణం చేయాలని ప్రభుత్వ సంకల్పమన్నారు. దశల వారీగా కొత్త బస్సులను అన్ని డిపోలకు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. కొత్త బస్సుల ప్రారంభం ద్వారా ప్రజలు మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించగలరని అన్నారు. కార్యక్రమంలో సాలూరు డిపో మేనేజర్ డి.సూర్యనారాయణ మూర్తి, డిప్యూటీ మేనేజర్ కరుణశ్రీ, డిప్యూటీ సూపరెండెంట్ మల్లేశ్వర రావు ఆర్.టి.సి. సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం పాండ్స్‌తో భూమి సారవంతం

జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధి హామీ చట్టం కింద ఏర్పాటు చేస్తున్న పారంపాండ్స్‌ను జిల్లాలో విరివిగా చేపట్టాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా రైతులకు పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని విక్రంపురం పంచాయతీలో ఉపాధిహామీ కింద చేపడుతున్న పలు పనులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డ్వామా పీడితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. విక్రంపురంలో పశువుల నీటితొట్టెల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం విక్రంపురం పంచాయతీ తమ్మన్నదొరవలసలో నిర్మించిన మినీ గోకులాలను పరిశీలించి, లబ్ధిదారులతో ముచ్చటించారు. అలాగే నందాపురంలో నిర్మిస్తున్న ఫారం పాండ్స్‌ను తనిఖీ చేసిన లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సాగుభూమిని సారవంతం చేయడం లోనూ, ప్రతి ఏటా రైతులు బహుళ పంటల వైపు మళ్లేలా చేయడంలో ఫారం పాండ్స్ ఎంతగానో సహాయ పడతాయని పేర్కొన్నారు. వ్యవసాయ సాగులో నీటి కొరతను తీర్చి, పంటల దిగుబడిని పెంచడం, తద్వారా రైతుల ఆదాయం పెంపే దీని లక్ష్యమని వివరించారు. ఈ పాండ్స్ వల్ల వర్షపు నీటిని సేకరించి నిల్వ చేసుకోవచ్చని, నిల్వ చేసిన నీటిని వ్యవసాయానికి, పశువులకు అందించుకోవచ్చని గుర్తుచేశారు. అలాగే చేపల పెంపకం వంటి వాటిని కూడా చేపట్టేందుకు ఈ ఫారం పాండ్లను వినియోగించుకోవచ్చని రైతులకు స్పష్టం చేశారు. కావున ఫారం పాండ్లను విరివిగా చేపట్టేందుకు ముందుకు రావాలని రైతులను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల లబ్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఫారం పాండ్స్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. రైతులు ఎంత మంది కోరితే అన్ని మంజూరు చేస్తామని తెలిపారు. ఈ పాండ్స్ వినియోగంతో రైతులు అధిక దిగుబడి, రాబడి సాధించాలన్నదే తన తపన అని అన్నారు. తొలుత విక్రంపురంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన చేసిన కలెక్టర్, జిల్లాలో 411 నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గోకులా లు, ఫారంపాండ్స్ ను కలెక్టర్ పరిశీలించి, వాటి వలన కలిగే ప్రయోజనాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు, వైసిపి నాయకులు కలింగ మల్లిబాబు, పలు శాఖల ఇంజినీరింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్ పనులను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి, కలెక్టర్

సదస్సులో మాట్లాడుతున్న బివి రమణ

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- కనీస వేతనాలు అమలు చేయాలి
- కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా కన్వీనర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షతన మండంగి హరినాథ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా గ్రామీణ పేదలకు ఎంతో సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం విచారకరమన్నారు. అతితక్కువ వేతనంతో ఫీల్డ్ అసిస్టెంట్లు జీవనం సాగిస్తున్నారని, రోజురోజుకు ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లపై పని భారాన్ని మోపుతుందని విమర్శించారు. ఇటీవల రాజకీయ వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను కించపర్చేలా అధికార పార్టీ నాయకులు నిందించడం సరైంది కాదన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ముఖ్యమైన ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర కార్మికుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో ఫీల్డ్ అసిస్టెంట్లను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండగొర్రి శంకరరావు, ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాయపిల్లి వెంకటరమణ, నాయకులు రామారావు, సింహాచలం, మోహన్‌దాస్, ఆదినారాయణ, గంగ, రవణమ్మ తదితరులు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలకు చెందిన ఫీల్ అసిస్టెంట్లు అధిక సంఖ్యలో పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

15.82 శాతం వృద్ధి దిశగా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ల్లాలో 15.82 శాతం వృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. 2024-25 వార్షిక ప్రగతిలో భాగంగా గతేడాది జిడిపిలో 16.90 శాతం జిల్లా అభివృద్ధి సాధించగా, ఈ ఏడాది 16.12 శాతంగా అభివృద్ధిని అంచనా వేస్తూ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన జిల్లా ప్రగతిపై మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గతేడాది తలసరి ఆదాయం రూ.1,67,543 కాగా, ఈ ఏడాది రూ.1,94,048గా అంచనా వేస్తూ 15.82 వృద్ధిరేటు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 49.27 శాతం ప్రాథమిక రంగం (వ్యవసాయ,అనుబంధ రంగాలు), 9.09 శాతం పారిశ్రామిక, 41.64 శాతం సేవా రంగాల నుంచి వృద్ధి ఉండబోతుందన్నారు. జిల్లా ఎక్కువగా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడినందున దానిపై ఎక్కువగా దృష్టి సారించి వృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మత్స్య, ఉద్యానవన పంటల సాగు జిల్లాలో ప్రధానమైన రంగాలని, ఉద్యానవనంలో రూ.470 కోట్లు అదనపు వేల్యూ ఎడిషన్, ఏరియా ఎక్స్ పేన్షన్, సూక్ష్మ నీటిపారుదల వంటి పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టబోతున్నామని, కషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లైవ్ స్టాక్ ద్వారా ఎక్కువగా జీవనోపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసామని, అందులో భాగంగా డ్వాక్రా స్త్రీనిధి, ఐటిడిఏ నిధుల నుంచి గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకం వంటి కార్యక్రమాలను చేపట్టబోతున్నట్లు చెప్పారు.

ఉపాధిహామీ చట్టంలో భాగంగా గత మూడేళ్లలో ఉపాధి కల్పన కింద 128.91 లక్షల పనిదినాలు సృష్టించబడ్డాయన్నారు. ఈ ఏడాది 133.91 లక్షల పనిదినాలతో అధిగమించి, గతేడాది కంటే 5 లక్షల పనిదినాలు అధికంగా కల్పించినట్లు చెప్పారు. జాబ్ కార్డ్ కలిగిన కుటుంబానికి సగటుగా 72 రోజులు ఉపాధి లభించిందన్నారు. ఈ ఏడాది రూ.250 వేతనదారులు పొందారన్నారు. గతేడాది 100 రోజుల పని దినాలుగా 48,445 కుటుంబాలు చేయగా, ఈ ఏడాది 49,416 కంటే ఎక్కువ కుటుంబాలకు పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. గతేడాది 1.76 లక్షల కుటుంబాలు పథకాన్ని ఉపయోగించుకోగా, ఈ ఏడాది 1.79 లక్షల కంటే ఎక్కువ కుటుంబాలు పథకాన్ని ఉపయోగించుకున్నారని వివరించారు. వేతన చెల్లింపుల్లో గతేడాది రూ.300 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.322.54 కోట్లు చెల్లించామన్నారు. గతేడాది రూ.67 కోట్లు మెటీరియల్ వినియోగం ఖర్చు కాగా, ఈ ఆర్థిక సం.లో రూ.201.58 కోట్లు వ్యయం చేసినట్లు చెప్పారు. ఈ నిధుల్లో 50 శాతం వరకు రోడ్ల కోసం వెచ్చించినట్లు కలెక్టర్ వివరించారు. ప్రహరీ గోడలు 331కు గాను రూ.22 కోట్ల 42 లక్షలతో 198 పనులు, 742 గోకులాలు, 40 వేల వరకు ప్లాంటేషన్లను పంపిణీ చేశామని చెప్పారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా ఈ ఏడాది మరింత మెరుగైన ఉపాధిహామీ పనులు, మెటీరియల్ పనులను చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో కూడా చెత్త నుంచి సంపద కేంద్రాలను పనులను పూర్తిచేస్తామని, చాలా చోట్ల బరియల్ గ్రౌండ్లు బాగాలేవని, వాటిపై కూడా దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని అన్నారు. నిమ్మగడ్డిని ఉద్యానవన పంటల్లోకి తీసుకొని, దాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. జిల్లాలో 280 ప్రధాన ట్యాంకులున్నాయని, వాటిని పునరుద్ధరణ, స్లూయిస్ మరమ్మతులు చేపట్టడం ద్వారా ట్యాంకులను అభివృద్ధితో పాటు ఆక్రమణల తొలగింపుపై ప్రధాన దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. బొబ్బిలి వీణకు పనస చెట్లు చాలా తోడ్పడనున్నందున, పనస సాగు చేసేందుకు 120 ఎకరాలను గుర్తించామన్నారు. జిల్లాలో మత్స్య పరిశ్రమపై 17,800 మంది మత్స్యకారులు ఆధారపడి ఉన్నారని, ఉపాధిహామీ కింద 450 చేపల ట్యాంకులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 1న జిల్లావ్యాప్తంగా 911 పశువుల తాగునీటి తొట్టెలను ప్రారంభించామని, వీటిని ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. అలాగే 12,000 ఫారం పాండ్స్‌ను అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఎస్సీ సర్వీస్ కనెక్షన్లు 23,457, ఎస్టీ సర్వీస్ కనెక్షన్లు 50,302 ఉన్నాయని తెలిపారు. ఈ గహాల్లో 200 యూనిట్లు కంటే తక్కువ విద్యుత్ వినియోగం ఉంటే ఉచితంగా ప్రభుత్వం విద్యుత్తును ఇస్తుందని, దీనికి ప్రత్యామ్నాయంగా పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఎలక్ట్రికల్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేసి ఉచితంగా కరెంటును ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన 176 ఎకరాల భూమిని ఏపీఈపీడిసిఎల్‌కు అందజేసి శతశాతం పూర్తిచేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. విలేకరుల సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు పూర్తి చేయాలి

పార్వతీపురం : జిల్లాలో మంజూరు చేసిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తక్షణం పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గృహ నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, ఇంజినీరింగ్ పనులు, తదితర అంశాలపై మంగళవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న 7,134 మరుగుదొడ్లు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పిఎంజన్ మాన్ కార్యక్రమంలో గృహ నిర్మాణం శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. 4 వేల గృహాలను మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. సాలూరు మున్సిపాలిటీ పరిధిలో 437 మందికి, పార్వతీపురంలో 548 మందికి, పాలకొండలో 197 మందికి అదనపు సహాయం జమ చేసినట్టు తెలిపారు.

వాట్సాప్ ద్వారా సేవలు అందించాలి

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వాట్సాప్ పరిపాలన ద్వారా ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 75 వేల మంది ఎస్‌సి, ఎస్ టి లబ్ధిదారులకు పిఎం సూర్యఘర్ కింద జిల్లాలో ఉన్నారని, అందుకు అవసరమగు సౌర విద్యుత్ పార్కు నిర్మాణం చేసేందుకు స్థలాన్ని గుర్తించాలని అన్నారు. అలాగే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పని చేయించాలని ఆదేశించారు. ఇడిఆర్‌డిల వారీగా నివేదికలు సమర్పించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక మాట్లాడుతూ రైతు గుర్తింపు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డా.పి ధర్మచంద్రా రెడ్డి, ఇపిడిసిఎల్ ఇఇ కె.చలపతిరావు, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గిరిజన కళల అభివృద్ధికి కృషి : పిఒ

సీతంపేట : గిరిజన కళలైన సవర పెయింటింగ్స్ అభివృద్ధికి కృషి చేస్తామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పిఎంఆర్సిలో జరుగుతున్న సవర పెయింటింగ్ శిక్షణ కార్యక్రమాన్ని పిఒ సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన చిత్రకారులు గీసిన సవర పెయింటింగ్ చిత్రాలను పిఒ పరిశీలించి చాలా బాగున్నాయని ప్రశంసించారు. ఈ శిక్షణను మరికొన్ని రోజులు కొనసాగించాలని సూచించారు. సవర పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రదర్శించేందుకు పిఎంఆర్‌సిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు గదులను ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎపిఐటిసిఒ డైరెక్టర్ సుధీర్, అపర్ణ లక్ష్మి, అనిల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రకారునికి జ్ఞాపికను అందజేస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గొట్టు మంగళాపురం వద్ద నాగావళి నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు

ఉచిత ఇసుక విధానానికి తూట్లు ● చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

నాగావళి నది నుంచి కొంతమంది అక్రమార్కులు ఇసుక తమదేనంటూ దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసినప్పటికీ దానికి తూట్లుపడుతున్నాయి ఇసుక అక్రమ రవాణాకు తూట్లు పొడుస్తున్నారు అడ్డూ అదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. నాగావళి నది తీర ప్రాంతాలైన మండలంలోని గోపాలపురం, గొట్ట మంగళాపురంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతుంది. గట్టు మంగళాపురం దగ్గర వంతెనకు 100 మీటర్లు దూరంలోనే ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. 500 మీటర్లు దాటి ఇసుక తవ్వుకోవాలన్న నిబంధనలున్నా వాటిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా కొంతమంది వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అదేవిధంగా గోపాలపురంలో ఉదయం ట్రాక్టర్లు, రాత్రి పూట లారీలతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. లారీకి రూ.5వేలు నుంచి రూ.8వేలు వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎటువంటి అనుమతుల్లేకుండా ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గోపాలపురం గ్రామస్తులు కూడా ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం వస్తే వరద ముంపుతో వారు భయపడుతున్నారు. అనధికారికంగా ఇసుక రవాణా జరుగుతుందని తెలిసినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎటువంటి అనుమతులు లేవు

మండలంలో ఇసుక రీచ్‌లకు ఎటువంటి అనుమతుల్లేవు. అయితే మండలంలో ఎక్కడైనా ఇళ్ల నిర్మాణాలకు, అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవచ్చును. అలా కాకుండా అక్రమంగా ఇసుకను ఎవరైనా తరలిస్తే చర్యలు తప్పవు.

పి.బాలమురళీకృష్ణ, తహశీల్దార్.

జిల్లా ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రిని మంగళవారం కాయకల్ప స్టేట్ కన్సల్టెంట్ సురేష్ ఆధ్వర్యంలో బృందం పరిశీలించింది. ఈ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు, వైద్యుల అందుబాటు వాటిని బృందం పరిశీలించింది. ఆసుపత్రి సూపరిండెంట్ బి వాగ్దేవిని ఆసుపత్రికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణలో గ్రేడ్లను నిర్ణయించి బహుమతులతో పాటు ఆసుపత్రి మెరుగుకు నిధులు విడుదల చేసే ఈ బృందం పలుమార్లు ఆసుపత్రిని దశలవారీగా పరిశీలించనున్నట్లు సూపరిండెంట్ తెలిపారు. కార్యక్రమంలో కాయకల్ప బృంద సభ్యులు డాక్టర్ రమేష్ బాబు, రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్‌తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న స్త్రీనిధి రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్

రుణాలను జీవనోపాధికి ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి సాలూరురూరల్

సంఘాల ద్వారా మహిళలు తీసుకునే రుణాలను వారి జీవనోపాధికి మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకొనేందుకు ఉపయోగించుకోవాలని రాష్ట్ర స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు భవనంలో విఒఎలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల వార్షిక అప్పులు, జీవనోపాధుల తయారీపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ప్రతి సంఘాన్ని నమోదు చేయాలని తెలిపారు. మండలంలోని 37 గ్రామ సంఘాల పరిధిలో గల ప్రతి మహిళ సంఘాలకు ఒక ఎన్యూమరేటర్‌ను ఎంపిక చేశామని, వీరికి కేటాయించిన సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మహిళా సంఘాలు సభ్యులు ఇంత వరకు ఎంత అప్పు తీసుకున్నారు, 2025 - 26లో ఎంత అప్పు కావాలి, ఏ నెలలో కావాలి, ఎంత కావాలి, తీసుకున్న అప్పు ఏ విధమైన జీవనోపాధికి వినియోగిస్తారనే విషయాలను యాప్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిడి వై. సత్యం నాయుడు, ఎపిఎం జయమ్మ, స్త్రీ నిధి ఏజిఎం హేమలత సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో విఒఎలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిడి సన్యాసిరావు సిబ్బంది పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కమలకుమారి తదితరులు పాల్గొన్నారు**పాచిపెంట** : స్థానిక వెలుగు కార్యాలయం వద్ద విఒఎలకు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ బి.శివున్నాయుడు శిక్షణలో అవగాహన కల్పించారు. సర్వే నిర్వహించేందుకు చదువుకుని చురుగ్గా పనిచేసే 130 మంది యానిమేటర్లను నియమించామన్నారు. సర్వే అంశాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో విఒఎలు, ఇనిమేటర్లు, సిసిలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన చైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో అన్న క్యాంటీన్‌ను మంగళవారం నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ టి.జయరాం సందర్శించారు. అక్కడ అల్పాహారాన్ని తిని పరిశీలించారు. నాణ్యమైన, రుచికరమైన భోజన పదార్థాలు అందించాలన్నారు. పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణగా ఉన్న ఆప్కాస్ రద్దు చేసినప్పుడు కూటమి ప్రభుత్వం హామీలో భాగంగా అందర్నీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సాలూరు కమిటీ హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సాలూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శంకరరావు మాట్లాడుతూ కార్మికులను రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం తనకు నచ్చిన విధానాలు అమలు చేస్తే కార్మికులు ఆందోళనకు వారే బాధ్యత వహిస్తారని ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. అలాగే స్థానిక మున్సిపాల్టీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడం పట్టణంలో పరిపాలన స్తంభించిందని, కార్మికులు, ఉద్యోగులు, ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎవరూ కృషి చేయడం లేదని విమర్శించారు. గత కొంతకాలంగా కమిషనర్ ఉన్నా కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండేవారని, ప్రస్తుతం అతడ్ని సరెండర్ చేయడం వల్ల ఎఫ్‌ఎసి ఎవరికీ ఇవ్వలేదని అన్నారు. దీంతో నేటికీ కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు చెల్లించని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ చేస్తున్నామని చెబుతున్న జిల్లా మంత్రి, కలెక్టర్ సాలూరు మున్సిపాలిటీపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొనసాగితే సాలూరు శ్యామలాంబ పండగ ముందు సమ్మెకు కూడా వెనుకాడమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీను రవి పోలరాజు, ఆదినారాయణ కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పరీక్ష అనంతరం వీడ్కోలు చెప్పుకుంటున్న విద్యార్థులు

ముగిసిన టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మార్చి 17 నుంచి నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంతో పాటు గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, నీలానగరం, బిటివాడ పరీక్షా కేంద్రాల్లో 734 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ బిటివాడ నుంచి 1, వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 6గురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. పరీక్షలు ముగిసిపోవడంతో విద్యార్థులంతా ఒక చోటికి చేరి పరీక్ష బాగా రాశావంటూ ఒకరికొకరు చెప్పుకొని వీడ్కోలు తెలుపుకున్నారు.

జెసిని వినతిని ఇచ్చేందుకు వచ్చిన రేతుగూడ గిరిజనులు

సంక్షేమ పథకాలు అందవు.. సౌకర్యాలూ లేవు

జెసికి రేతుగూడ గిరిజనుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

అటు ఒడిశా, ఇటు ఆంధ్రా ప్రభుత్వాలు తమకు ఎలాంటి సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని రేతుగూడ గిరిజనులు మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు పాలమిట్ట రాము ఆధ్వర్యాన గిరిజనులు జెసిని కలిసి సమస్యల్ని వివరించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా 40 గిరిజన కుటుంబాలు రేతుగూడలో నివసిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని పెదమరికి పంచాయతీలో చందలింగి, కొత్తూరుకు దగ్గరలో నివశిస్తున్నారని చెప్పారు. ఈ గ్రామం ఆంధ్రాకు దగ్గరగా ఉన్నప్పటికీ రికార్డుల పరంగా ఒడిశాలో ఉందని తెలిపారు. ఒడిశా ప్రభుత్వం ఏవిధమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, రేషన్ సరుకులు అందడం లేదని వాపోయారు. ఆంధ్రా ప్రభుత్వం నుంచి కూడా ఏ విధమైన సహకారం అందడంలేదన్నారు. గ్రామంలో పాఠశాల గానీ, అంగన్వాడీ కేంద్రం గాని లేవని చెప్పారు. గ్రామానికి రహదారి సౌకర్యం కూడా లేదని చెప్పారు. ఎస్టీ జాతాపు తెగకు చెందిన వీరంతా నిరుపేదలేనన్నారు. రేతుగూడ గ్రామాన్ని పెదమరికి పంచాయతీ లో విలీనం చేయాలని కోరారు.

నేడు బిసి కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఒబిఎంఎంఎస్ వెబ్ సైట్‌లో బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజురు కొరకు నమోదు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ సాల్మన్ రాజు తెలిపారు. ఒఈ ఎంపిక ప్రక్రియకు బ్యాంకు సిబ్బంది, బిసి కార్పొరేషన్ సిబ్బంది హాజరవుతారని తెలిపారు. కావున లబ్ధిదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

చినబోగిలిలో రవాణా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం, పాలకొండ, సాలూరుకు సంబంధించిన రవాణా వాహనాల ఫిట్నెస్ పరీక్షలను మండలంలోని చినబోగిలిలో గల ఆటోమేటెడ్ ఫిట్నెస్ సెంటర్‌లోనే చేయడం జరుగుతుందని జిల్లా రవాణా అధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వాహన యజమానులంతా దీన్ని గమనించాలని ఆయన కోరారు.

టెన్త్ విద్యార్థులకు కరపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలంటూ మంగళవారం కళాశాల సిబ్బంది విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. భవిష్యత్తు మీ చేతిలో ఉంది గనుక ఆలోచించి ఉన్నత శిఖరాలు అవలంబించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల చేరాలని పదో తరగతి పరీక్ష రాసి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎ.కమల కుమారి, పి.ముద్దు, తదితరులు పాల్గొన్నారు.

5న తిరుమల సాయి హై స్కూల్‌లో పట్టా ప్రదానోత్సవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెదమే రంగి సెంటర్ సమీపంలో గల తిరుమల సాయి హైస్కూల్‌లో ఈనెల 5న పట్టా ప్రదాన మహోత్సవం జరుగుతుందని ఆ హై స్కూల్ కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసి ప్రాథమిక విద్యలో అడుగుపెట్టిన సందర్భంగా ఆ విద్యార్థులకు, అలాగే ప్రాథమిక విద్య పూర్తి చేసి ఉన్నత విద్యలో అడుగుపెట్టిన విద్యార్థులకు పట్టా ప్రదాన మహోత్సవం జరుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా తరగతుల విద్యార్థులు, తల్లితండ్రులు హాజరుకావాలని ఆమె కోరారు అలాగే నర్సరీ నుండి 9వ తరగతి విద్యార్థులకు కోర్స్ కంప్లీట్ సర్టిఫికెట్ మహోత్సవం జరుగుతుందన్నారు.

పెదబోగిలిలో నవోదయం 2.0

ప్రజాశక్తి - సీతానగరం

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి పర్యవేక్షలో మండలంలోని పెదబోగిలిలో నాటుసారాయి తాగడం వల్ల జరిగే అనార్ధాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో నాటుసారాయి అమ్మకాలు నిర్మూలనే ధ్యేయంగా రెవెన్యూ, పోలీసుల సహకారంతో నిరంతర నిఘా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ, సిబ్బంది, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పెదబోగిలిలో అవగాహన నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులు రూ.2వేల కోట్లు బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పైల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు చెప్పాడా సుబ్బయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. నిర్వహించారు ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం, పెండింగ్ క్లైముల పరిష్కారం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలని కోరారు. గత రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు చెస్ ద్వారా బోర్డులో ఉన్న రూ.2వేల కోట్లు గతరాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు దారిమళ్లించి తమ కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడిచిందని ఆరోపించారు. సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు అందకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించడంలోనూ, ఆదుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కావున కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలని, ఉపాధికి నష్టం చేసే మెమో 12,13ను రద్దు చేయాలని, తమ డబ్బులు రూ.2వేల కోట్లు తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు చక్రధర్, కెల్ల మోహన్‌రావు, బండి కోటి, కృష్ణ, మజ్జి మురళి, మంగమ్మ సుశీల, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఆజూరులో రేషన్‌డిపో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఆజూరు గిరిజన వద్ద రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మర్రి చినబాబు, పాముల సన్యాసిరావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆజూరు గిరిజన పంచాయతీలో రేషన్ డిపో ఏర్పాటు చేసి గిరిజనులకు నిత్యసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఆజూరులో రేషన్ డిపో లేకపోవడంతో ఆజూరుతో పాటు కుంభీవలస, కొండంగిపాడు గ్రామాల గిరిజనులు సుమారు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరానున్న పద్మాపురం పంచాయతీ రోడ్డవలసకు వెళ్లి రేషన్ డిపో ద్వారా సరుకులు తీసుకురావడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రజలు నరకయాతనపడుతూ రొడ్డవలస వెళ్లి అక్కడ తాగడానికి కూడా నీరు లేక తీవ్రమైన కష్టాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఐటిడిఎ పిఒ, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకమైన దృష్టి పెట్టి రేషన్ డిపోను ఆజూరులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్ పోరాటాలు ఉదతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులు పాంగి సంజు, సొంపు సుందర్రావు, దబ్బటి రాము, జి.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆవిరి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఆవిరి, వలసబల్లేరు గిరిశిఖర గ్రామాల్లో ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆవిరిలో ప్రజా దర్బార్ నిర్వహించారు. అక్కడ లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు మౌలిక వసతులైన విద్యా, వైద్యం, రహదారి, తాగునీరు, సోలార్ సౌకర్యం కల్పిస్తూ ప్రజలను అన్ని విధాలా ఆదుకొని అభివృద్ధి పరచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, కూటమి నాయకులు బి.కడయి బి.రామకృష్ణ, ఆకుల రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ :ఉపాధి నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని వెంకంపేటలో ఉపాధి హామీ చట్టం నిధులతో పశువులకు నిర్మించ తలపెట్టిన తాగునీటి తొట్టెల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పశువుల తాగునీటి తొట్టెలు, గోశాలలు టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం వేసవిలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా వాటికి అవసరమైన తాగునీటి తొట్టెలను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టె నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని చెముడుగూడలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నీటి తొట్టెల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పశుపక్షాదులకు నీటి ఎద్దడి లేకుండా నీటికుండీల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అనంతరం జెకెపాడులో అబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఎఎంసి చైర్ పర్సన్ కళావతి, టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్, అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని దయానిధిపురం, కోట సీతారాంపురంలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం కింద చేపడుతున్న ఫారంఫండ్స్ పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల మస్తర్లను తనిఖీ చేసి నిర్ణీత సమయంలో పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఏ ఉపాధి కూలీ వడదెబ్బకు గురికాకుండా ఉండాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో చేపడుతున పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి వేగవంతం చేయాలని గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా ఉపాధి కూలీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట :ఉపాధిహామీ చట్టంలో భాగంగా మండలంలో 31 నీటి తొట్టెలు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తుమరాడలో మంగళ వారం నీటితొట్టెల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎవిఎస్ నగేష్, పుష్పారావు, ఎంపిటిసి సభ్యులు రాజు, జయరాం, తిరుపతిరావు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకంపేటలో తాగునీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

పింఛన్ల పంపిణీలో మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. మంగళవారం సాలూరు మున్సిపాలిటీ పరిధిలో 23వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఇంటింటికీ మంత్రి వెళ్లి పింఛన్లు అందజేశారు. పింఛన్లు అందుతున్న తీరును లబ్ధిదారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కింద వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, కళాకారులకు తదితర అన్ని రంగాలకు చెందిన వాటికి కనీస పింఛను రూ.4వేలు కాగా, గరిష్టంగా రూ.15 వేలు అందిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 1,39,752 మందికి రూ.59.72 కోట్లు ఎన్ టి ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఇతర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ పరిధిలోని కొత్తవలసలో గల 5,6,7 వార్డుల పరిధిలో గల నగిరి కాలనీతో పాటు పలు వార్డుల్లో మంజూరైన వితంతు పింఛన్లను ఆయా అవార్డు కౌన్సిల్ సభ్యులతో స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఆయా వార్డు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

92 శాతం పింఛన్లు పంపిణీ

వీరఘట్టం : మండలంలోని 24 సచివాలయాల పరిధిలో మంగళవారం వివిధ రకాల సంబంధించి పింఛనుదారులకు 92:11శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఇన్చార్జ్ ఎంపిడిఒ డి వెంకటరమణ తెలిపారు. మండలంలోని 9 613 మందికి గాను 8855 మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్ భర్త మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కోదుల వీరఘట్టం సర్పంచ్ ప్రతినిధి మీనక రమణారావు (56) అనారోగ్యంతో శ్రీకాకుళంలో హాస్పిటల్లో మృతి చెందారు. కోదుల వీరఘట్టం సర్పంచ్ మీనక చెంచమ్మ భర్త రమణారావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సీతంపేట, పెద్దూరు తదితర గ్రామాల సర్పంచులుకళావతి, ఆదిలక్ష్మి, వెంకి నాయుడు, తిరుపతిరావు, తిరుపతి తదితరులు సంతాపం తెలిపారు.

ఎంపిడిఒకు బదిలీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎంపిడిఒ కె.గీతాంజలి బదిలీపై విజయవాడ ఎపిఎస్ఐఆర్‌డిపిఆర్‌కు ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమె 2022లో గ్రూప్-1 అధికారిగా మొదటి పోస్టింగ్ సీతంపేట ఎంపిడిఒగా నియమకమయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మంల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని ఆమె తెలిపారు. మండల అభివృద్ధిలో సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, కలెక్టర్, జెడ్‌పి సిఇఒకు, ఐటిడిఎ పిఒలకు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజల దాహార్తితో పాటు జిల్లాకు ప్రతిరోజు వివిధ పనులపై వచ్చిన ఇతర ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు.. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్‌తో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఈ చలివేంద్రాలను జిల్లా కలెక్టరేట్ వద్ద, స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ చలివేంద్రాలను స్థానిక ప్రజలతో పాటు జిల్లా కేంద్రానికి పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిదిమిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణీలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం ,ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బాలేసులో వాలంటీర్ కుటుంబాన్ని దుడ్డుఖల్లులో వైసిపి కార్యకర్త గౌరీ కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జడ్పీటీసీ రాధిక, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాగాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ముగిసిన పోలమాంబ జాతర

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి జాతర మహాచండీయాగంతో మంగళవారం ముగిసింది. ఈ చండీయాగం రేగిడి ఆముదాలవలస మండలం ఖండ్యాం గ్రామానికి చెందిన అంపోలు రుద్ర కోటేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ నేతృత్వంలో జరిగింది. స్థానిక ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ పర్యవేక్షణలో 16 మంది దేవీ ఉపవాసకులచే మహాచండి హెూమాన్ని నిర్వహించారు. 55 మంది దంపతులచే శాస్త్రోత్తమంగా ఏకాదశ హెూమగుండ సహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహాచండీ హెూమం కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు

అన్నదాన కార్యక్రమం వద్ద ఘర్షణ

దేవాదాయ శాఖ మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించింది. పోలమాంబ జాతర ముగింపు సందర్భంగా జరిగిన ఈ అన్నదాన కార్యక్రమంలో స్థానికుల మధ్య కొట్లాటకు దారి తీసింది. స్థానిక వనం గుడి వద్ద ఓవైపు మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుండగా గ్రామానికి చెందిన టప్పాలు అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన శ్రీరాములుకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో తొలుత టప్పాలు శ్రీరాములపై దాడి చేయడంతో దానికి బదులుగా శ్రీరాములు కూడా టప్పాలుపై దాడి చేశాడు. వెంటనే అక్కడే ఉన్న స్థానిక ఎస్సై వెంకటరమణ, సిబ్బంది కలుగజేసుకుని గొడవను సద్దుమణిగ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిల్లాడకు ఊయక రాహుల్ (20) భీమవరం సమీపాన కృత్తివేని వద్ద విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాహుల్ ఇటీవల ఉపాధి నిమిత్తం చేపల చెరువు కాపలా కొలువు కోసం భీమవరం జిల్లా కృత్తివేని వెళ్లాడు. అక్కడ ప్రమాదవ శాత్తూ మార్చి 30న విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి గ్రామానికి మృతదేహం రావడంతో తల్లిదండ్రులు తిరుపతిరావు, నిర్మల గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. రాహుల్‌ది నిరుపేద కుటుంబం. ముగ్గురు కుమారులకు పెద్ద కుమారుడు రాహుల్, రెండో కుమారుడు జీవన్, మూడో కుమారుడు మదన్. చేతికి అందుకు వచ్చిన పెద్ద కుమారుడు మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కన్నీరు మున్నీరై రోధిస్తున్నారు. ఉపాధి కోసం మచిలీపట్నం రాహుల్‌తో పాటు ఈ గ్రామం నుండి మరి కొంతమంది యువత వెళ్ళినట్లు గ్రామస్తులు తెలిపారు.

మృతి చెందిన రాహుల్

టిడిపికి చైర్మన్.... వైసిపి అసమ్మతికి వైస్‌చైర్మన్

బొబ్బిలి: అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో బొబ్బిలిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు సిద్ధం కావడంతో పట్టణంలో ఎక్కడ చూసినా రాజకీయ చర్చ వినిపిస్తుంది. అవిశ్వాస తీర్మానం పెట్టిన తర్వాత ప్రస్తుతం ఉన్న చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణను చైర్మన్ పదవి నుంచి తొలగించి ఆ పదవిని టిడిపికి అప్పగించేందుకు, వైస్ చైర్మన్ జి.రమాదేవిపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆ పదవి నుంచి దించేసి వైస్ చైర్మన్ పదవిని టిడిపికి మద్దతు ఇస్తున్న 10మంది కౌన్సిలర్లలో ఒకరికి ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు సమాచారం.

చైర్మన్ పదవి రేసులో ఇద్దరు

మున్సిపల్ చైర్మన్ పదవి రేసులో టిడిపి నుంచి టిడిపి పట్టణ అధ్యక్షుడు, 8వ వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్న ఆరో వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన సావు వెంకట మురళీ కృష్ణ ఉన్నారు. అవిశ్వాస తీర్మానంతో చైర్మన్ పదవిని కాపు సామాజిక వర్గం కోల్పోవడంతో అదే సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్‌కు చైర్మన్ పదవి అప్పగించాలని వాదన గట్టిగా వినిపిస్తుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి చైర్మన్ అభ్యర్థిగా గెంబలి శ్రీనివాసరావును రాజులు ప్రకటించి ఎన్నికలకు వెళ్లడంతో ఆ ఎన్నికల ఖర్చు కూడా గెంబలి శ్రీనివాసరావు పెట్టారు. టిడిపికి మెజారిటీ రాకపోవడంతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా గెంబలి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. ఇప్పుడు టిడిపికి చైర్మన్ పదవి దక్కితే శ్రీనివాస రావుకు ఇవ్వాలని ఆ పార్టీలో కొంతమంది కోరుతున్నట్లు సమాచారం. కాపు సామాజిక వర్గానికి ఇవ్వాలి అనుకుంటే శరత్‌కు, గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి అనుకుంటే గెంబలి శ్రీనుకు చైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో ఎస్సై పి.నారాయణరావు, సిబ్బందితో కలిసి మంగళవారం జరిపిన దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు కురుపాం నుంచి చినమేరంగి వెళ్లే బిటి రహదారి వద్ద మహిళ సారా అమ్ముతున్నట్టు తెలుసుకొని పట్టుకున్నామని తెలిపారు. నాటు సారా విక్రయిస్తున్న కురుపాంకు చెందిన తోటపల్లి శాంతిని అదుపులోకి తీసుకొని, సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా నాటు సారా అమ్మినా, తరలించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.